సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ప్రయాణం.. ప్రమాదకరం

రాజంపేట మండలంలోని ఆర్గొండ నుంచి సిద్దాపూర్ వరకు రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది.

- IIIలో ▸



దాడులు చేస్తే సహించం

ఆలయాలపై దాడులకు నిరసనగా గురువారం లింగంపేట, బిచ్కుంద, నస్రుల్లాబాద్ మండల కేంద్రాల్లో బంద్ నిర్వహించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /18.9

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురియవచ్చు. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు పక్కాగా నిర్వహించాలి



కామారెడ్డి రూరల్: ధాన్యం కొనుగోళ్లు పక్కాగా నిర్వహించాలని డీసీవో రామ్మోహన్‌రావు సూచించారు. గురువారం కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, ట్యాబ్ ఆపరేటర్లకు ఆయన అవగాహన కల్పించారు. కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకు రాగానే సీరియల్ నెంబర్లు అందించాలన్నారు. నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించారు. ధాన్యం మిల్లులకు తరలించిన తర్వాత ట్యాబ్‌లలో రైతుల వివరాలు ఎంటర్ చేసి, వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. సూపరింటెండెంట్ ప్రశాంత్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ, ఏవో పవన్ కుమార్, సొసైటీ చైర్మన్ పాత లక్ష్మణ్, సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

సొసైటీని సందర్శించిన నాబార్డ్ ప్రతినిధులు




లింగంపేట: లింగంపేట ప్రాథమిక సహకార సంఘాన్ని నాబార్డు ప్రతినిధులు గురువారం సందర్శించారు. సహకార సంఘం, బ్యాంకు సిబ్బంది, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, సంఘం అభివృద్ధి, రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడంపై ఆరా తీశారు. రుణాల రికవరి 50శాతానికి పెంచాలని సూచించారు. సొసైటీకి వస్తున్న ఆదాయంపై చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీఈవోలు పెంటయ్య, సందీప్ వివరించారు. సొసైటీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి రూ. 2.20 కోట్లు రుణం తీసుకున్నట్లు తెలిపారు. కిరాయిదారుల నుంచి ముందుగా అడ్వాన్సులు సేకరించి బ్యాంకులో రూ.4 కోట్లు డిపాజిట్ చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రతినిధులు రైతులతో మాట్లాడారు. సహకార సంఘం అభివృద్ధి చెందాలంటే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఏజీఎం సుమన్, మేనేజర్ కుమారస్వామి, సీఈవోలు పెంటయ్య, సందీప్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టాలి



నిజాంసాగర్: గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టి ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చాలని జర్మని పార్లమెంటరీ ప్రెసిడెంట్ హెంద్రిక్ హెర్రింగ్‌ను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు గురువారం అసెంబ్లీకి వచ్చిన జర్మని పార్లమెంటరి ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జుక్కల్ నియోజకవర్గం లాంటి గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ విషయమై జర్మని ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించనట్లు ఎమ్మెల్యే 'సాక్షి'తో తెలిపారు.

జీపీల్లో రాష్ట్ర బృందం తనిఖీలు



నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో గురువారం రాష్ట్ర సీఆర్‌డీ బృందం తనిఖీలు చేసింది. ఉపాధి హామీ రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల్లోని నర్సరీని పరిశీలించారు. సీఆర్‌డీ బృందం సాంకేతిక విభాగం అధికారి అబేద్‌ఖాన్, ఎంపీడీవో సూర్యకాంత్ పాల్గొన్నారు.

వసతి గృహం..



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని గురువారం జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ సందర్శించారు. వసతి గృహంలో ఉన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

ఇన్‌చార్జీల పాలనతో ఇక్కట్లు!

- నాలుగు నెలలుగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పోస్టు ఖాళీ
- కీలకమైన శాఖలన్నింటికీ ఇన్‌చార్జి అధికారులే..
- తాజాగా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రిలీవ్
- పనిభారంతో ఆయా శాఖల్లో లోపిస్తున్న పర్యవేక్షణ



కామారెడ్డి కలెక్టరేట్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా నుంచి అధికారులు బదిలీ అయి వెళ్లడమే తప్ప తిరిగి వచ్చే వారు కరువయ్యారు. దీంతో చాలా విభాగాలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. బదిలీలతో కొందరు, దీర్ఘకాలిక సెలవుల్లో మరికొందరు వెళ్లడంతో ఆయా శాఖలు ఇతర శాఖల అధికారుల చేతుల్లో పెట్టాల్సి వస్తోంది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనదైన శైలిలో అన్ని అంశాలపై దృష్టి పెడుతూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తుండగా, కీలకమైన శాఖలకు అధికారులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. జిల్లాలో రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రమోహన్ నాలుగు నెలల క్రితం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పీఎస్‌గా వెళ్లారు. నాటి నుంచి ఆ బాధ్యతలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చూస్తున్నారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటాయి. ఇదే సమయంలో ధాన్యం కొనుగోళ్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ చూసేవారు. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేక ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా, వాటన్నింటినీ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చూసుకోవాలి. ఇదే సమయంలో రెవెన్యూ వ్యవహారాలు, ధాన్యం కొనుగోళ్లు వంటివి చూసుకోవడం అంటే తలకుమించిన భారమే.

రిటైర్మెంట్‌కు దగ్గరలో మరికొందరు

జిల్లాలో పలువురు అధికారులు మరికొద్ది రోజుల్లో రిటైర్మెంట్ కానున్నారు. వచ్చే ఏడాది అంటే మార్చి, ఏప్రిల్ మాసాల్లో పలువురు రిటైర్ అవుతారు. కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్‌రావు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరికొందరు అధికారులు రిటైర్మెంట్ వరుసలో నిల్చున్నారు. ఇప్పటికే చాలా శాఖలకు ఇన్‌చార్జీలతో నెట్టుకు వస్తుండగా, రిటైర్మెంట్‌లతో మరి కొన్ని శాఖలు ఇన్‌చార్జీల పాలన కిందకు పోనున్నాయి. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య, ఆరోగ్య శాఖకు..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇక్కడ పోస్టింగ్ తీసుకున్న అధికారులు సెలవుపై వెళ్తుండటంతో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. మొన్నటి వరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగిన లక్ష్మణ్‌సింగ్‌పై మహిళా వైద్యులు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ బాధ్యతలను చంద్రశేఖర్‌ను అప్పగించారు. ఆయన సౌమ్యుడు కావడంతో గట్టిగా మందలించ లేకపోవడం, ఎవరిపైనా అజమాయిషీ చేయకపోవడం మూలంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్ల వ్యవహారం కలకలం రేగింది. ఇన్‌చార్జి అధికారులు అటువంటి వారిపై చర్యలు తీసుకునే ధైర్యం చేయడం లేదు.

ఒక్కరికి మూడు బాధ్యతలు

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూవో) బావయ్య అప్పట్లోనే బదిలీ అయినా బుధవారం రిలీవ్ అయ్యారు. దీంతో ఇన్‌చార్జిగా జిల్లా పరిషత్ సీఈవో చందర్‌నాయక్‌కు అప్పగించారు. ఇప్పటికే ఆయన జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన అటు జిల్లా పరిషత్‌ను, ఇటు బీసీ సంక్షేమ శాఖను, తాజాగా మహిళా శిశు సంక్షేమ శాఖను చూసుకోవాలి. వాస్తవంగా మహిళా శిశు సంక్షేమ శాఖ కీలకమైంది. వేలాది మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారికి సంబంధించి అన్ని వ్యవహారాలను మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న బావయ్య మహిళా శిశు సంక్షేమ అధికారిగా ఏడాదిపాటు పనిచేశారు. ఇటీవల ఆయన రెవెన్యూ శాఖకు తిరిగి వెళ్లేందుకు బదిలీ ప్రయత్నాలు చేసుకున్నారు. అయితే కలెక్టర్ రిలీవ్ చేయకుండా ఇక్కడే పనిచేయాలని కొంతకాలం ఒత్తిడి చేశారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో బుధవారం రిలీవ్ అయ్యారు. ఇప్పటికే మహిళా శిశు సంక్షేమ శాఖలో అనేక సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జీల పాలన మరింత ఇబ్బందికరంగా మారనుందని అంటున్నారు.

పాలనకు ఆటంకం

జిల్లాలో వివిధ సంక్షేమ శాఖలకు ఇన్‌చార్జీలే దిక్కవుతున్నారు. బీసీ సంక్షేమాధికారి బదిలీ కాగా జెడ్పీ సీఈవో చందర్‌నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. మైనారిటీ సంక్షేమ శాఖకు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి దయానంద్ కొనసాగుతున్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా ఎస్సీ వెల్ఫేర్ అధికారి రజితకు బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే హాస్టళ్లను పర్యవేక్షించాలి. అదనపు పనిభారంతో పర్యవేక్షణ లేక పాలనకు ఆటంకం అవుతోంది. అలాగే జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి సెలవుపై వెళ్లడంతో వేరే వారికి బాధ్యతలు అప్పగించారు. సహకార శాఖ అధికారిగా వచ్చిన మమత సెలవుపై వెళ్లడంతో నిజామాబాద్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. పౌర సరఫరాల శాఖ అధికారి కూడా సెలవుపై వెళ్లడంతో మరొకరికి అప్పగించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కూడా ఇన్‌చార్జే కొనసాగుతున్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది.

ఒకే పోలీస్ విధానం ఉండాలి



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఏడో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు

- గడ్డి తీయడం, రాళ్లు ఎత్తడమే పోలీస్ ఉద్యోగమా..
- జాతీయ రహదారిపై ఏడో బెటాలియన్ పోలీస్ కుటుంబాల సభ్యుల ధర్నా



ఆందోళన చేస్తున్న వారిని తీసుకెళ్తున్న పోలీసులు

డిచ్‌పల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం ఉండాలని డిచ్‌పల్లి టీజీఎస్‌పీ ఏడో పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం బెటాలియన్ మెయిన్ గేటు ఎదుట 44వ నెంబరు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. చంటి పిల్లలను ఎత్తుకుని కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు సుమారు రెండు గంటల పాటు ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్ సిబ్బందితో బెటాలియన్ వద్దకు చేరుకుని ఆందోళనకారులను సముదాయించేందుకు యత్నించారు. జాతీయ రహదారిపై రాస్తారోకోతో ఇబ్బందులు కలుగుతాయని బెటాలియన్ లోనికి వెళ్లి అధికారులతో వారి సమస్యలు చర్చించాలని సూచించారు. అయితే మహిళలు తమ పట్టువీడలేదు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగమంటే గడ్డి తీయడం, రాళ్లు ఎత్తడమేనా అని ప్రశ్నించారు. తమ భర్తలు 8 గంటలకు మించి పని చేయటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బెటాలియన్ పోలీసులకు ఐదేళ్లు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీజీఎస్పీ బెటాలియన్స్‌కు చెందిన పోలీసులు వెట్టిచాకిరి చేస్తున్నారని, ఇటీవల మారిన విధినిర్వహణలో భాగంగా నెలలో 4 రోజులు మాత్రమే ఇంటికి వస్తున్నారన్నారు. మూడు నెలలకోకసారి పోస్టింగ్‌లు మార్చటంతో పిల్లల చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలో ఒకే పోలీస్ విధానాన్ని అనుసరించడం లేదని విమర్శించారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. విధి నిర్వహణ పేరుతో ప్రభుత్వం వారిని కుటుంబాలకు దూరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనకారులు పట్టువీడక పోవడంతో జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి బెటాలియన్ వద్దకు చేరుకున్నారు. వారిని ఆందోళన విరమించాలని సముదాయించారు. అయితే వారు పట్టువీడక పోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్ చేరుకుంది. పోలీసులు కాన్వాయ్ వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసినప్పటికీ కేటీఆర్ వాహనాన్ని నిలిపి ఆందోళనకారుల వద్దకు చేరుకుని వారి నిరసనకు సంఘీభావం తెలియజేశారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేష్‌ను పిలిచి మాట్లాడారు. సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. కేటీఆర్ వెళ్లిన తర్వాత కూడా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో మహిళా కానిస్టేబుళ్ల సాయంతో వారిని బలవంతంగా పక్కకు తీసుకెళ్లారు. చివరకు ప్రభుత్వం 26న బెటాలియన్ కానిస్టేబుళ్ల సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోనుందని అధికారులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉన్నతాధికారుల ఆరా..

రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీసింగ్ విధానం అమలు చేయాలని నిరసన తెలిపిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులపై పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఫొటోలు, వీడియోల ఆధారంగా ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నాగరాణి

భిక్కనూరు: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి నాగరాణి అన్నారు. గురువారం భిక్కనూరులోని ఐకేపీ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు పోవాలని సూచించారు. మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్థికంగా వృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఎస్సై రామ్‌చందర్‌నాయక్, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

కామారెడ్డి టౌన్: విద్యార్థులు చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి నాగరాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలిక హాస్టల్‌ను గురువారం ఆమె సందర్శించారు. హాస్టల్‌లోని వంటగది, స్టోర్ రూంలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాయ సురేష్, మోహన్‌రావు, కులకర్ణి, చంద్రసేన్‌రెడ్డి, వార్డెన్ స్వప్న పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచొద్దు



విచారణకు హాజరైన వినియోగదారులు, అధికారులు, నాయకులు

నిజామాబాద్ అర్బన్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వినియోగదారులు వ్యతిరేకించారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు 2024 – 25 సంవత్సరానికి రిటైల్ సరఫరా ప్రతిపాదనలను వివరించారు. ఎల్‌టీ వినియోగదారులకు ఎనర్జీ చార్జీలు పెంచలేదన్నారు. ఎక్కువమంది వినియోగదారులకు విద్యుత్ చార్జీల్లో పెరుగుదల లేదన్నారు. 300 యూనిట్ల కంటే ఎక్కువ వినియోగించే ఎల్‌టీ–1 గృహ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీలను రూ.40 చొప్పున పెంచాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. హెచ్‌టీ వినియోగదారులకు ఫిక్స్‌డ్ చార్జీల్లో స్వల్ప పెరుగుదల ఉంటుందని పేర్కొన్నారు. ఎనర్జీ చార్జీలను పెంచలేదన్నారు. అన్ని ఓల్టేజీ స్థాయిల కోసం డిమాండ్ చార్జీలను నెలకు రూ.25 చొప్పున పెంచాలని నిర్ణయించినట్లు వివరించారు. దీనిపై వివిధ వర్గాల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ప్రజలపై భారం మోపేందుకు..

రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలు చెప్పి రూ.18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బహిరంగ విచారణలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఇళ్లకు వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్‌డ్ ఛార్జీని ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా దాన్ని రూ.50కి పెంచాలని డిస్కమ్‌లు కోరడం సరికాదన్నారు. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలన్నారు. డిస్కంలు చేస్తున్న ప్రతిపాదనల వెనుక ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


కామారెడ్డి క్రైం: ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నరకం ధాన్యం గుర్తించడానికి వాటి బస్తాలకు ఎర్రని రంగు దారంతో కుట్టడంతో పాటు బస్తాపై ఎస్ అనే అక్షరాన్ని ముద్రించాలని ఆదేశించారు. దొడ్డు రకం ధాన్యం బస్తాలను ఆకుపచ్చ దారంతో కుట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీటి వసతి, టెంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, మార్కెటింగ్ అధికారి రమ్య, సహకార అధికారి రాంమోహన్, డీపీఎం రమేష్ బాబు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

కామారెడ్డి క్రైం: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, భవనాల మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పనికి సంబంధించిన వివరాలు ఫొటోలతో సహా నివేదిక అందించాలన్నారు. ఆయా పనులు పూర్తి చేసి ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో లాభాలు

మాచారెడ్డి: పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని మాచారెడ్డి, కొత్తపల్లి, సోమారంపేట, లక్ష్మీరావులపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. డ్రాగన్ ఫ్రూట్ తోట, నర్సరీ, ధాన్యం కొనుగోలు కేంద్రం, డెయిరీ ఫాంలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడి, నీటి వినియోగంతో మంచి లాభాలు వచ్చే డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎకరం పొలంలో ఇప్పటి వరకు రెండు టన్నుల డ్రాగన్ ఫ్రూట్ వరకు అమ్మి రూ.3 లక్షలు సంపాదించినట్లు రైతు యాసినా తెలిపారు. మహిళా సంఘం నుంచి రూ.మూడు లక్షల లోన్ తీసుకొని డ్రాగన్ ఫ్రూట్ వేశానని చెప్పారు. అనంతరం కొత్తపల్లిలోని పట్టు పురుగుల యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అదే గ్రామంలో కూరగాయలు సాగు, చేపల పెంపకం చేపడుతున్న బోడ శ్రీకాంత్‌తో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం సోమారంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మాచారెడ్డిలో మహిళా సంఘం నుంచి లోన్ తీసుకొని తస్లీమా బేగం ఏర్పాటు చేసిన శారీ, చెప్పుల దుకాణాన్ని సందర్శించి వ్యాపారం గురించి తెలుసుకున్నారు. లక్ష్మీరావులపల్లి గ్రామంలో తుమ్మ రవళి ఏర్పాటు చేసిన డైయిరీ ఫామ్‌ను పరిశీలించారు. ఆర్డీవో రంగనాథ్ రావు, డీఆర్‌డీవో సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, సహాయ పౌరసరఫరాల అధికారి నరసింహరావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపి బాబు ఉన్నారు.



లక్ష్మీరావులపల్లిలో డెయిరీ ఫామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

విండోలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం చెల్లదు

- బస్వాపూర్ సొసైటీ విభజనపై తీర్పు వెలువరించిన హైకోర్టు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భిక్కనూరు మండలం బస్వాపూర్ సహకార సంఘాన్ని బైఫరికేషన్ చేసి రెండు సొసైటీలుగా ఏర్పాటు చేసినప్పటికీ విభజన ప్రక్రియ పూర్తి కాకముందే, గెజిట్ వెలువడకముందే పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఈ మేరకు గురువారం హైకోర్టులో వాదనలు జరిగిన తరువాత న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్న కిష్టాగౌడ్‌పై అప్పట్లో సభ్యులు అవిశ్వాసం పెట్టారు. అయితే ఆయన కోర్టును ఆశ్రయించడంతో ఫలితాన్ని పెండింగులో పెట్టారు. అప్పటికే విండోను విభజించాలని చేసిన తీర్మానం మేరకు సహకార శాఖ ఇటీవల విండోను విభజించి బస్వాపూర్, కాచాపూర్ రెండు సొసైటీలను ఏర్పాటు చేసింది. సొసైటీని రెండుగా విభజించిన నేపథ్యంలో ఉన్న పాలకవర్గం ఉనికి కోల్పోవడంతో రెండు విండోలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. కాచాపూర్ విండోపర్సన్ ఇన్‌చార్జిగా కిష్టాగౌడ్‌ను, బస్వాపూర్ విండో పర్సన్ ఇన్‌చార్జిగా మల్లారెడ్డిని నియమించారు. విండో విభజన జరిగినట్టు గెజిట్ విడుదల కాకముందే పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడంపై విండో వైస్ చైర్మన్, డైరెక్టర్లు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై వాదోపవాదనల అనంతరం గెజిట్ విడుదల కాకముందే పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడాన్ని కోర్టు తప్పుపట్టింది. గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో సొసైటీ విభజన పూర్తి కానట్లే. ఈ నేపథ్యంలో సొసైటీ సభ్యులు ఎన్నుకున్న కమిటీని కొనసాగించాల్సి ఉంటుంది. అయితే అప్పటికే చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడంతో కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశాలున్నాయి. సొసైటీ విభజన ప్రక్రియ పూర్తి కానందున వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 వరకు పాలకవర్గం కొనసాగవచ్చని భావిస్తున్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో సహకార శాఖ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

క్లుప్తంగా

28న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ రూరల్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిజామాబాద్ రీజియన్ పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాణిక్‌బండార్‌లో ఉన్న కాకతీయ ఉమన్స్ కాలేజీలో, కామారెడ్డి జిల్లాలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలు కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. అదే విధంగా ప్రావిడెంట్ ఫండ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేటీఆర్‌కు స్వాగతం



కామారెడ్డి క్రైం: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్‌లో జరిగిన రైతు ధర్నాకు హాజరు కావడానికి వెళ్తున్న ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కామారెడ్డి సమీపంలోని పొందుర్తి చౌరస్తా వద్ద నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నాయకులతో కొద్దిసేపు కేటీఆర్ మాట్లాడారు. అనంతరం కేటీఆర్ వెంట ఆదిలాబాద్‌కు తరలివెళ్లారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



కామారెడ్డి టౌన్: బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సిరిసిల్లరోడ్, వీక్లీ మార్కెట్‌లలో వ్యాపారులకు ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేయించినట్లు పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు బాలురి ప్రతాప్ నేత, ముదాం శ్రీకాంత్, ఉపాధ్యక్షులు చిన్నోళ్ల రజనీకాంత్, సబ్బని ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు పాటిల్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి ముదాం రాజగోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు న్యాయ సలహాలు తీసుకోవాలి



భిక్కనూరు: రైతులు విత్తనం కొనుగోలు మొదలు.. పంటను అమ్ముకునే వరకు సాగులో ఎదురయ్యే సమస్యలపై న్యాయ సలహాలను అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రెగ్యులర్ మొదటి కార్యదర్శి టి.నాగరాణి సూచించారు. గురువారం భిక్కనూర్ రైతు వేదికలోని అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి రైతులకు అందిస్తున్న న్యాయ సలహాలపై పీఎల్‌వీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది ఖాన్, సాయి ప్రణీత్, పీఎల్‌వీ నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

102 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భిక్కనూరు/పెద్దకొడప్‌గల్(జుక్కల్): వైద్య పరీక్షల కోసం గర్భిణులు, బాలింతలు ఉచిత 102 అంబులెన్స్ సర్వీస్‌ను వినియోగించుకోవాలని పెద్దకొడప్‌గల్‌లో వైద్యులు ఉమాకాంత్, భిక్కనూరులో పైలెట్ మహేశ్ వేర్వేరుగా తెలిపారు. గురువారం పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీలో అమ్మఒడి కార్యక్రమానికి జుక్కల్, పిట్లం 102 వాహనాలు పెద్ద దడ్గి, ఫత్లాపూర్ సబ్ సెంటర్ల నుంచి గర్భిణీలను తీసుకురాగ వారికి వైద్యులు ఉమాకాంత్ పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం మేనేజర్ మధు, ఈఎంఈ తిరుపతి, సిబ్బంది కారడి సాయిలు, నెహ్రూ, శ్రీకాంత్, మచ్చేందర్ పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో పశుసంపద వృద్ధి

- 90 శాతం కచ్చితత్వంతో మేలు జాతి ఆడ దూడల పునరుత్పత్తికి సాంకేతికత
- సబ్సిడీతో లింగ నిర్ధారిత వీర్య నాళికలను అందిస్తున్న ప్రభుత్వం



పిప్రిలో కృత్రిమ గర్భధారణ చేస్తున్న వైద్యురాలు

ఆర్మూర్: పాడి రైతులు తాము పెంచుకొనే బర్రె, ఆవుకు ఆడ దూడనే పుట్టాలి.. మగ దూడ(పోతు) పుట్టొద్దని అనుకుంటున్నారా..? అలాంటి పాడి రైతుల కోసమే పశు వైద్యుల వద్ద లింగ నిర్ధారిత వీర్యం(సెక్స్ సార్టెడ్ సీమన్) అందుబాటులో ఉంది. దీనితో ఎదలోకి వచ్చిన పశువుకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడ దూడలు పుట్టించే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. అమెరికా వ్యవసాయ శాఖ వారు మొదటగా కనుగొన్న ఈ నూతన సాంకేతికతను ప్రస్తుతం మన ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సబ్సిడీపై అందిస్తూ పాడి రైతులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా అన్ని మండల ప్రాథమిక పశువైద్య కేంద్రాల్లో, పశు వైద్య ఉపకేంద్రాల్లో, గోపాలమిత్ర సెంటర్లలో లింగ నిర్ధారిత వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. పాడి రైతులు వారి పాడి పశువు ఎదకు వచ్చినప్పుడు సరైన సమయంలో దగ్గరలోని కృత్రిమ గర్భధారణ నిపుణులను సంప్రదించాల్సి ఉంటుంది.

పశు వైద్యులు పశువు చెవిపోగు నంబరు, ఇతర వివరాలు నమోదు చేసుకుని లింగ నిర్ధారిత వీర్యంతో కృతిమ గర్భధారణ చేస్తారు. కృత్రిమ గర్భధారణ చేసిన తర్వాత ఉపయోగించిన లింగ నిర్ధారిత వీర్య నాళికలను రైతుకు భరోసా కొరకు అందజేస్తారు. అవసరమైతే వీర్య నాళికలపై గల నంబర్ సహాయంతో రైతు ఈ గోపాల యాప్‌లో రైతు సరిచూసుకోవచ్చు. కృత్రిమ గర్భధారణ చేసిన 90 రోజుల తర్వాత చూడి పరీక్ష చేయించాల్సి ఉంటుంది. దూడపుట్టిన 15 రోజులలోపు కృత్రిమ గర్భధారణ నిపుణునికి వివరాలు అందించాలి.

ఒక లింగ నిర్ధారిత వీర్య నాళిక ధర రూ.675 కాగా ప్రభుత్వం రూ.425 సబ్సిడీతో అందిస్తోంది. దీంతో రైతులు కేవలం రూ.250 మాత్రమే చెల్లించి తమ పశువులకు కృత్రిమ గర్భదారణ చేయించుకోవచ్చు. కృత్రిమ గర్భధారణ చేయించిన తర్వాత పశువు చూలు కట్టకపోతే మరోసారి ఎదలోకి వచ్చినప్పుడు మళ్లీ కృతిమ గర్భధారణ చేయించాల్సి ఉంటుంది.

ఒకవేళ రైతు రెండు సార్లు కృత్రిమ గర్భధారణ చేయించినా పశువు చూలు (గర్భం) కట్టకపోతే. రైతు రెండు సార్లు చెల్లించిన వాటాధనం రూ.500 తిరిగి రైతు బ్యాంక్ అకౌంట్‌కి తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ జమ చేస్తుంది.

గతంలో 50 శాతమే..

గతంలో పశువుల్లో కృత్రిమ గర్భధారణకు వినియోగిస్తున్న సాధారణ వీర్య నాళికల ద్వారా 50 శాతం వరకు మాత్రమే ఆడదూడలు పుట్టే అవకాశం ఉండేది. ప్రస్తుతం లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి కృత్రిమ గర్భధారణ చేయిస్తే 90 శాతం కంటే ఎక్కువ మేలు జాతి ఆడదూడలు పుట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా పాడి రైతులు మగ దూడల నిర్వహణ భారం నుంచి సులువుగా తప్పించుకోవచ్చు. బర్రెలలో అయితే ముర్రా జాతి, ఆవులలో అయితే సాహివాల్, హెచ్‌ఎఫ్, జెర్సీ సంకరజాతులకు సంబంధించిన వీర్యం పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంది.

ఆరోగ్యవంతమైన పశువులను తీసుకురావాలి



నాలుగు ఈతల లోపు, ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని క్రమం తప్పకుండా ఎదకు వచ్చే ఆరోగ్యవంతమైన పశువులలో కట్టు శాతం ఎక్కువ కాబట్టి పాడి రైతులు ఇలాంటి పశువులకే లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించాలి. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న ప్రాథమిక పశు వైద్య కేంద్రాలను, పశువైద్య ఉపకేంద్రాలను, గోపాల మిత్రులను సంప్రదించాలి. – శైలజ, పశువైద్యాధికారి, పిప్రి

భార్య నుంచి ఆస్తులు ఇప్పించాలని ఆందోళన



సుర్బిర్యాల్‌లో ఆందోళన చేస్తున్న మోహన్ గౌడ్, కుటుంబ సభ్యులు

పెర్కిట్: వరకట్నం కేసుతో తన ఆస్తులు రాయించుకున్న భార్య నుంచి తిరిగి ఇప్పించాలని ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌కు చెందిన మోహన్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. వివరాలిలా ఉన్నాయి. గోవింద్‌పేట్‌కు చెందిన మోహన్‌గౌడ్‌కు ఆర్మూర్‌కు చెందిన మహిళతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2016లో మహిళ తన భర్తతో పాటు కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. కేసును విత్ డ్రా చేసుకోడానికి భర్త మోహన్‌గౌడ్‌కు సంబంధించిన ఆస్తులను తన పేరిట రాయించుకుంది. అనంతరం భర్తను దుబాయికి పంపించింది. ఇటీవల తిరిగి వచ్చిన భర్తకు తన భార్య ఇతర వ్యక్తితో సహజీవనం చేస్తోందని తెలిసింది. దీంతో గురువారం మోహన్‌గౌడ్ తన భార్య సహజీవనం చేస్తున్న సుర్బిర్యాల్‌కు చెందిన వ్యక్తి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. భార్య నుంచి తన ఆస్తులు తనకు ఇప్పించాలని, అలాగే భార్య సహజీవనం చేస్తున్న వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధ, గురువారాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. బాత్‌రూమ్‌లో జారిపడి ఒకరు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువులో పడి మరొకరు, బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించారు.



శ్రీనివాస్ మృతదేహం

ఖలీల్‌వాడి: బాత్‌రూమ్‌కు వెళ్తుండగా ఓ వ్యక్తి కాలుజారి పక్కనే ఉన్న బండలపై పడి మృతి చెందిన జిల్లా కేంద్రంలోని ఆనంద్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్‌కు చెందిన కుర్రె శ్రీనివాస్(50) నాలుగేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకొని ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న బండలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ఒకరు..



నారాయణ(ఫైల్)

ఎడపల్లి: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన ఎడపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉడుత నారాయణ(43) జిల్లా కేంద్రంలో ఫ్రిడ్జ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటి నుంచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు మండల కేంద్రంలోని పులి చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడడంతో మృతి చెందాడు. చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి పంచనామ నిర్వహించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని నర్సన్నపల్లి బస్‌షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం బస్‌షెల్టర్‌లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. తెల్లని గడ్డం, నలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు కలిగి ఉన్నాడు. మృతుడి వయస్సు 40–45 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై రాజు తెలిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కల్లు బట్టీల్లో మగ్గుతున్న బాల్యం



రామేశ్వర్‌పల్లి కల్లు దుకాణం వద్ద సీసాలు ఏరుతున్న బాలుడు

కామారెడ్డి రూరల్: బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన బాల్యం కల్లు సీసాలు ఏరుతోంది. చదువుకోవాల్సి సమయంలో కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి వద్ద బాలుడు కల్లు సీసాలు ఏరుతూ కనిపించాడు. బాల కార్మిక చట్టాలు ఎన్ని తెచ్చినా పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదనడానికి ఈ చిత్రం సాక్ష్యం. ఆ బాలుడు కల్లు దుకాణం నిర్వాహకుల వద్దనే పని చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఒంటరి జీవితం భరించలేక ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: ఒంటరి జీవితం భరించలేక ఒకరు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జానకంపేట్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నిజాం కాలనీకి చెందిన ముజీబ్‌బేగ్(26) భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. తల్లిదండ్రులు, పిల్లలు ఎవరూ లేకపోవడంతో నాటి నుంచి ఒంటరిగానే బతుకుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారాడు. దీంతో జీవితంపై విరక్తితో జానకంపేట్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో పడి మరొకరు..

తాడ్వాయి: కుటుంబ కలహాలతో ఒకరు చేద బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలంలోని నందివాడలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నందివాడకు చెందిన ముక్కు సాయికుమార్(25)కు, మద్దికుంటకు చెందిన అఖిలతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. సంసార విషయంలో వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తితో సాయికుమార్ బుధవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బూదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

మాచారెడ్డి: అనారోగ్యంతో మృతి చెందిన భర్తకు ఓ భార్య తలకొరివి పెట్టిన ఘటన మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇసాయిపేట మైసయ్య(50)అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతుడికి సంతానం లేకపోవడంతో భార్య లక్ష్మి తలకొరివి పెట్టింది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

బోధన్‌రూరల్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సాలూర మండల కేంద్రంలోని అంత్రరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో బుధవారం రాత్రి రూ.10,080 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను పట్టుకొని సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. బైక్‌పై గుట్కాను బ్యాగ్‌లో తరలిస్తుండగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి బైక్‌ను, గుట్కా బ్యాగ్‌ను వదిలేసి అక్కడి నుంచి పారిపోయాడు. గుట్కా బ్యాగ్‌ను స్వాధీనం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ తాలూకా కార్యవర్గం ఎన్నిక



మద్నూర్‌లో ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో గురువారం టీఎన్జీవోస్ మద్నూర్ తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన మద్నూర్ తాలుకా సర్వసభ్య సమావేశం నిర్వహిచారు. అధ్యక్షుడిగా పవన్‌కుమార్, కార్యదర్శిగా రంజిత్‌కుమార్, కోశాధికారిగా విశాల్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చంద్రకాంత్, దయానంద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కళావతి, సంయుక్త కార్యదర్శులుగా దత్తు, పండరి, సౌమ్యశ్రీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శంకర్, పబ్లిసిటీ కార్యదర్శిగా శ్రీహర్ష, ఈసీ సభ్యులుగా కుశాల్, వెంకట్రాంరెడ్డి, అబ్దుల్ నయీమ్, అనిల్ ఎన్నికైనట్లు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు, ఎన్నికల అధికారి సాయిలు తెలిపారు.

యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలి



వైస్ చాన్స్‌లర్‌ను సన్మానిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ యాదగిరిరావును సౌత్ క్యాంపస్‌లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధికి ప్రొఫెసర్లు కృషి చేయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ నారాయణ గుప్తా, హాస్టల్ వార్డెన్ డాక్టర్ యాలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి క్రైం: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఆర్కే, ఎస్ఆర్కే, వీఆర్కే కళాశాలల విద్యార్థులకు పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసచరన పోటీలను నిర్వహించారు. ఎస్సై అంజనేయులు, ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, పాఠశాల ప్రిన్సిపల్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధాలపై అవగాహన

కామారెడ్డి క్రైం: దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైనార్టీ కళాశాల విద్యార్థులు ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని తిలకించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, విధులు, బాధ్యతలు, ఆయుధాల రకాలు, వాటిని ఉపయోగించే విధానాలపై ఎస్సై రాజు విద్యార్థులకు వివరించారు.

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ పోలీస్ స్టేషన్లో గురువారం ఆయుధాల వాడకం గురించి విద్యార్థులకు స్థానిక ఎస్సై భువనేశ్వర్ వివరించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, మంత్రులపై అనర్హత వేటువేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ స్పీకర్ ప్రసాద్ కూమర్, కౌన్సిల్ చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు దానిని ఎగ్గొట్టేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు, రేపు ఇంటర్ కాలేజీ సెలెక్షన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాడ్మింటన్(మెన్) సెలెక్షన్స్ శుక్రవారం ఉదయం క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో, 26న శనివారం ఉదయం కబడ్డీ(మెన్) సెలెక్షన్స్ నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ జి బాలకిషన్ గురువారం పేర్కొన్నారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూమి కోసం ఇరు గ్రామాల ఘర్షణ



ఘర్షణ పడుతున్న తండాల వాసులు

గాంధారి: అటవీ భూమీ కోసం మండల పరిధిలోని గౌరారం, వెంకటాపూర్ తండా వాసులు గురువారం ఘర్షణపడి పరస్పర దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అధికారులు వెళ్లే సరికి ఘర్షణ సద్దు మణిగింది. వివరాలిలా ఉన్నాయి. గౌరారం శివారులో అటవీ భూమిని పలువురు ఆక్రమించి సాగుచేస్తున్నారని ఆరోపిస్తూ అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ గౌరారం గ్రామస్తులు ఫారెస్టు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. స్పందించిన అధికారులు మూడు రోజులుగా ఫారెస్టు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తున్నారు. గురువారం సర్వే పూర్తి కావడంతో భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటాపూర్ తండాకు చెందిన ఓ కుటుంబ సభ్యులు, గౌరారం గ్రామస్తులపై దురుసుగ ప్రవర్తించడంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరు గ్రామాల వారు ఒకరినొకరు నెట్టుకుని గల్లాలు పట్టుకునే వరకు వెళ్లింది. మధ్యవర్తులు నచ్చచెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఈ విషయమై తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని సంప్రదించగా సర్వే పూర్తయిందని, సర్వే రిపోర్టులు ఎల్లారెడ్డి ఆర్డీవోకు అప్పగిస్తామన్నారు. పైఅధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వర్ని: చందూర్ మండల కేంద్రంతో పాటు ఘన్పూర్ శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించారు. గురువారం తెల్లవారుజామున చందూర్ శివారులో రెండు, ఘనపూర్ శివారులో ఒక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్లు, కాయిల్స్ చోరీకి గురైనట్లు సంబంధిత రైతులు విద్యుత్ శాఖ ఏఈ గోపికి సమాచారం అందించారు. అనంతరం ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బడాభీమ్‌గల్‌లో రెండిళ్లలో ..

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌లో బుధవారం అర్ధరాత్రి దుండగులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ప్రభాకర్, ముకేశ్ అనే ఇదరు అన్నాదమ్ముళ్ల ఇళ్ల తాళాలను దుండగులు పగులగొట్టి 5 తులాల బంగారం, పది తులాల వెండి, రూ. 20 వేల నగదును దొంగిలించారు. దుండగులు ప్రభాకర్, ముకేశ్ ఉన్న పక్క ఇళ్లకు గొల్లాలు పెట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమ్‌గల్ పోలీసులు తెలిపారు.

పగలు రెక్కీ.. రాత్రి దొంగతనం

మోర్తాడ్: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో దుండగులు పగలు రెక్కీ నిర్వహించి రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆరేటి వినయ్ ఇంటికి మంగళవారం తాళం ఉండటంతో గమనించిన దుండగులు ప్లాన్ ప్రకారం ముఖానికి మాస్కులు ధరించి ఇంట్లో సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. అనంతరం ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నగదు, బంగారాన్ని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీ తీరును పరిశీలిస్తే తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ఇతర చోట్ల ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామంలో పేకాట స్థావరాలపై బుధవారం అర్ధరాత్రి దాడి చేసినట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పలుచోట్ల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరాలపై దాడులు చేశామని అందులో 8 మందిని పట్టుకొని వారి నుంచి రూ. 30వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కారుపై విరిగి పడ్డ చెట్టు కొమ్మ



కారుపై పడ్డ చెట్టు కొమ్మను తొలగించిన స్థానికులు

ఎల్లారెడ్డి: పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారుపై చెట్టు కొమ్మ విరిగి పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా చెట్లను నరికి వేస్తున్నారు. చెట్లను నరుకుతున్న సమయంలో ఓ కొమ్మ హైదరాబాద్ వైపు వెళ్తున్న కారుపై పడింది. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసం కాగా అందులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. చెట్లను నరుకుతున్న సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ తగు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

మొరం టిప్పర్‌కు జరిమానా

మోపాల్: మండలంలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను భూగర్భ గనులశాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. పట్టుకున్న టిప్పర్‌కు రూ.2వేలు జరిమానా విధించారు.